క్లుప్తంగా

చల్లాకు శుభాకాంక్షల వెల్లువ



చల్లాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి ఇస్లావత్ ఆంజనేయులునాయక్, మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్ ఆధ్వర్యంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు కేతావత్ మోహన్‌నాయక్, పాత్లావత్ జానియా పాల్గొన్నారు.

పరామర్శ



మహేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

మహేశ్వరం: పెండ్యాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మదిలపురం మహేందర్‌రెడ్డి తల్లి ప్రేమలమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రేమలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటున్నామని అనితారెడ్డి, కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మదిలపురం నరేందర్‌రెడ్డి, జైత్వారం జగన్‌మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా గెలిపించండి: ఈటల

వనస్థలిపురం: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ నియోజకవర్గంలో బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని, అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమ్మ కుటుంబ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ, కమ్మ కుటుంబ సభ్యులు అందరికీ అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆయన పనామా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికిపాటి మోహన్‌రావు, జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, యలమంచిలి భాను ప్రసాద్, బాలాజీనాథ్, సంరెడ్డి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలా బస్తీలోని సమస్యలను 45 రోజుల్లోగా పరిష్కరించకపోతే రానున్న పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లోజు రవి అన్నారు. బస్తీలో స్థానికులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ కాలనీ నగరం నడిబొడ్డున ఉన్నా గత 22 సంవత్సరాలుగా కనీస వసతులు లేవని , కనీసం ఇంటింటికీ నల్లా కనెక్షన్ కూడా లేని దుర్భర స్థితిలో ఉన్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారుల దగ్గరకు వెళ్తే కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని, తక్షణమే తమ కాలనీ సమస్యలను పరిష్కరించకపోతే పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తామని సమావేశంలో పాల్గొన్న మహిళలు హెచ్చరించారు. మల్కాజిగిరి ఎంపీగా సేవలందించిన సీఎం రేవంత్‌రెడ్డికి తమ కాలనీ సమస్యలన్నీ తెలుసని, తమ కాలనీని అభివృద్ధి చేయాలని, లేకుంటే ఇక్కడ నుంచి తమ కాలనీని వేరేచోటికి తరలించాలని సీఎంకు మల్లోజు రవి విజ్ఞప్తి చేశారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 15, వంకాయ 18, బెండ 40, పచ్చి మిర్చి 55, కాకర 35, బీర 35, క్యాబేజి 20, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 20, దొండ 18-23, చిక్కుడు 28-50, గోకర 23, బీట్‌రూట్ 19. క్యాప్సికం 65, ఆలు 33, దోస 16, సొర 7, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.



మహేశ్వరం: ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



కల్యాణంలో పాల్గొన్న తీగల అనితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి
- ఘనంగా ఈదెమ్మ దేవాలయ వార్షికోత్సవం
- భక్తితో ముక్తి : ఎమ్మెల్యే సబిత సుభాన్‌పూర్‌లో మల్లికార్జున కల్యాణం



పూజలో తీగల అనితారెడ్డి, కృష్ణారెడ్డి

కందుకూరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దెబ్బడగూడలో ఈదెమ్మ దేవాలయంలో ఆదివారం మూడో వార్షికోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు వరికుప్పల జగన్, డేరంగుల జంగయ్య, ఆంజనేయులు, రాజు, నర్సింహ, శ్రీను, రామకృష్ణ, యాదయ్య ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణం అనంతరం బోనాలు సమర్పించారు. బలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఏనుగు శ్రావణి, జంగయ్య తదితరులు పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మహేశ్వరం: భక్తితో ముక్తి లభిస్తుందని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సుభాన్‌పూర్‌లో మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పంతో పాటు పుష్పాలంకరణ పలు పూజలను భక్తులు, యాదవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఎల్లమ్మ కల్యాణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేడీపీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ జేడీపీ ఫ్లోర్ లీడర్, పీసీసీ కార్యనిర్వాహక సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పి అంబయ్య యాదవ్, మాజీ సర్పంచ్ గుత్తి పద్మ, సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కుమార్ యాదవ్, పాండు, పర్వతాలు యాదవ్, తిరుపతిరెడ్డి, హన్మంత్‌రెడ్డి, శ్రీశైలం, ఎండి రవూఫ్, రాజు నాయక్, గుత్తి శ్రీను, నవీన్ పలువురు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటువేయండి

సీఐ మక్బూల్‌జానీ

- కందుకూరులో కేంద్రబలగాల కవాతు



నేదునూరులో సీఐఎస్‌ఎఫ్ కవాతు

కందుకూరు: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని సీఐ మక్బూల్‌జానీ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని నేదునూరు, బాచుపల్లి, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి గ్రామాల్లో సీఐఎస్‌ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలతో కందుకూరు పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అరాచక శక్తులతో అప్రమత్తంగా ఉండి శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

కనుల పండువగా అశ్వవాహన సేవ

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి అశ్వవాహన సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పద్మనాభచార్యులు, రామాచార్యులు వేద మంత్రాలు చదువుతుండగా వేంకటేశ్వస్వామి ఉత్సవ విగ్రహాన్ని అశ్వవాహన రథంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి కల్యాణ మండపం వరకు అశ్వవాహన సేవ కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజుకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, కృష్ణగౌడ్, ఆలయ క్లర్క్ ఆంజనేయులు, నిర్వాహకులు మధుకుమార్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మల్లేశ్, స్వామిగౌడ్, శంకర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



వేడుకల్లో పాస్టర్, సంఘం సభ్యులు

కడ్తాల్: మండల కేంద్రంలోని యేహోవా నిస్సీ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో, పాస్టర్ సఫీయా దస్తగిరి ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను , ఆరాధన కార్యక్రమాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సఫీయా నవాబు పాషా యేసు పునరుద్ధానం గురించి వివరించారు. అనంతరం పలు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మహిళలు, చిన్నారులు ఉన్నారు.

త్వరలో బీఆర్ఎస్ కనుమరుగు



విలేకరులతో మాట్లాడుతున్న కేశవులు

ఆమనగల్లు: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభావం కోల్పోయిందని పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఆ పార్టీ కనుమరుగు అవుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. అభివృద్ధిని కాంక్షించి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు రవీందర్ నాయక్, ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులికంటి మైసయ్యలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యమన్నారు. రాష్ట్రంలో 14 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుని సత్తా చాటుతుందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, కుంభకోణాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది గాడిలో పెడుతుందన్నారు. ఉమ్మడి పాలమూరు పార్లమెంట్ స్థానాలు భారీ మెజార్టీతో కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని వివరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీను నాయక్, రాగ్యా నాయక్, తదితరులున్నారు.

కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే

బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: కేంద్రంలో మరోసారి మోదీ సర్కారే అధికారంలోకి రాబోతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేశంలోని ప్రజలందరి మద్దతు ఉందని ప్రజలు మరోసారి మోదీ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారన్నారు. దేశాభివృద్ధి పీఎం మోదీతోనే సాధ్యమని తెలిపారు. దేశంలో అవినీతి రహిత, కుంభకోణాలు లేని పాలన అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. దేశానికి మోదీ లాంటి శక్తి వంతమైన ప్రధానమంత్రి అవసరమని చెప్పారు. బీజేపీని ఓడించాలని కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్షాలు అన్ని ఏకమై బీజేపీపై దండయాత్ర చేస్తున్నాయని విమర్శించారు. కానీ దేశంలోని ప్రజలందరూ మోదీ వెనకాల ఉన్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన బీజేపీ మూడోసారి దేశంలో అధికారంలోకి రాబోతుందన్నారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకునేందుకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇక్కడ విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి మోదీకి చేవెళ్ల సీటును కానుకగా అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి ఓటు వేయాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

షాబాద్: ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని షాబాద్ ఎంపీటీసీ గుండాల అశోక్, వ్యాపారవేత్త దండు విశ్వనాథం పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి తమవంతు సాయంగా అశోక్ రూ.51వేలు, విశ్వనాథం రూ.51వేలు అందజేశారు. అనంతరం గ్రామస్తులు శాలువాతో జెడ్పీటీసీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. పురాతన ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు దోనూరు శంకరయ్య, కుమార్, తదితరులు ఉన్నారు.

మళ్లీ క్యాంపు రాజకీయం

చైర్మన్ కోసం పడరాని పాట్లు

- ఏప్రిల్ 6న ప్రత్యేక సమావేశం
- అదే రోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- మరోమారు క్యాంప్‌కు బయలుదేరిన కౌన్సిలర్లు



మర్రి నిరంజన్‌రెడ్డి



ఆదిబట్ల మున్సిపాలిటీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ రాజకీయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ సారి ఎట్టి పరిస్థితుల్లో చైర్మన్ కుర్చీ చేజారకుండా అందరూ కలిసి కట్టుగా ఉండటానికి మళ్లీ క్యాంపు రాజకీయం మొదలు పెట్టారు. అప్పట్లో నెల రోజుల పాటు క్యాంపులు నిర్వహించారు. ఖర్చులు తడిసిమొపడైన బేఫరాక్ అన్నట్లుగా రాజకీయం చేస్తున్నారు. ఈ సారి గురి తప్పేది లేదని గన్‌షాట్‌గా కుర్చీనాదే అన్నట్లుగా ప్రణాళిక రూపొందించారు. వైస్ చైర్మన్ విషయంలో స్పష్టత కరువైంది. ఒకే ఒక్కడు ఓ సాధారణ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వంలోని పెద్దలకు గట్టి పోటీ ఇస్తున్నాడు. అలాగని ఆయన ఇతర ఏ పార్టీలో లేడు. కాంగ్రెస్ బహిష్కృత నేతగా ఉన్నాడు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ సంచలనాలే చోటు చేసుకున్నాయి.

చక్రం తిప్పుతున్న మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల మున్సిపాలిటీలో మొదట 2018లో జరిగిన ఎన్నికల్లో 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఆరుగురు బీఆర్ఎస్, ఒకటి బీజేపీ గెలుచుకుంది. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో ఎక్స్ అఫిషియో సభ్యులను ఉపయోగించి కాంగ్రెస్‌లో ఉన్న కౌన్సిలర్ ఆర్తికను బీఆర్ఎస్‌లోకి తీసుకొని చైర్మన్ అయ్యారు. అప్పట్లో మర్రి నిరంజన్‌రెడ్డి గెలిచి ఓడిపోయినంత పని అయ్యింది. యేడాది గడవకముందే చైర్‌పర్సన్ ఆర్తిక గౌడ్, మర్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యం అప్పటి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంది. అప్పటి నుంచి పాలకవర్గంలో సఖ్యత లేకపోవడంతో 13 మంది కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు చైర్‌పర్సన్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరోమారు డిసెంబర్ నెలలో చైర్‌పర్సన్, వైస్‌చైర్ పర్సన్‌లపై అవిశ్వాసం ఫిర్యాదు కలెక్టర్‌కు చేశారు. ఫిబ్రవరి 9న ప్రత్యేక సమావేశంలో ఇద్దరిని తొలగించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అప్పటి నుంచి మర్రి నిరంజన్‌రెడ్డి చక్రం తిప్పారు. కౌన్సిలర్లు అంతా మర్రికే మద్దతు తెలిపారు.

అడుగడుగునా అడ్డంకులే

మర్రి నిరంజన్‌రెడ్డి అడ్డంకులకు కేరాఫ్‌గా మారాడు. 2014లో ఎంపీపీగా ఎన్నిక కావడం కూడా మొదటిసారి కాకుండా రెండోసారి ఎంపీపీ అయ్యాడు. చైర్మన్ విషయంలో కూడా ఇదే జరగనుంది. కాంగ్రెస్‌లో ఉండి కాంగ్రెస్ చైర్మన్‌ను తొలగించడానికి కృషి చేశాడని ఇప్పటికే పార్టీ సస్పెండ్ చేసింది. అలాగే, ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధులు సైతం నోటిఫికేషన్ తేదీ ఇవ్వకుండా అడ్డుపడ్డారనే ఆరోపణలు చేశారు. దీంతో ఫిబ్రవరి 9వ తేదీ నుంచి నేటి వరకు కొత్త చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక తేదీ ఖరారు కాలేదు. దీంతో చివరకు హైకోర్టును ఆశ్రయించడంతో ఏప్రిల్ 6వ తేదీని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 4వ తేదీ వరకు పూర్తిస్థాయిలో సభ్యులకు ప్రత్యేక సమావేశం సర్క్యులర్ జారీ చేయాలి. 6న ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. అనివార్య కారణాల వల్ల సమావేశం జరగకుంటే 7న నిర్వహించాలని నిర్ణయించారు. బీజేపీ కౌన్సిలర్ రాములు, గతంలో వైస్ చైర్మన్‌గా ఉన్న కళమ్మ కొంగరకలాన్‌కు చెందిన హరిదాసు, మహేందర్, వనం శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. అదృష్టం నిరంజన్‌రెడ్డిని వరిస్తుందా లేదా అనేది చూడాలి.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: విద్యార్థులు సమాజంలో గొప్ప వ్యక్తులుగా ఉన్నత స్థానాలకు ఎదిగినప్పుడే చదువు నేర్పిన ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణంగా ఉంటుందని హెచ్‌ఎం విశ్వనాథ్‌గుప్తా అన్నారు. మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ఆదివారం చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996-97 బ్యాచ్‌కు చెందిన చెందిన పూర్వ విద్యార్థులు అంతా కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 27 సంవత్సరాల తరువాత కలిసి చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరి వారి విద్యార్థి దశను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విశ్వనాథ్‌గుప్తా మాట్లాడుతూ.. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు వారివారి జీవితాల్లో రాణిస్తూ ఉన్నత స్థాయిలో ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు వారిని వారు పరిచయం చేసుకుంటూ వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శంకరయ్య, శాంత, జ్యోతిర్మయి, శశికల, పూర్వ విద్యార్థులు రంగారెడ్డి, మల్లేశ్, గోపాల్, మధు, రవికాంత్‌రెడ్డి, మంజుల, రాంరెడ్డి, రమేశ్, హాజీ, అనంత్‌రెడ్డి, మానిక్యప్రభు, శ్రీదేవి, మంజుల, అలివేలు, అరుంధతి, మణిల, లక్కి, మాధవి, ఆనంద్, మాధవ్‌రెడ్డి, గోపిచందు, రవిప్రకాశ్, చంద్రశేఖర్‌రెడ్డి, జావిద్, ఉస్మాన్, మోహన్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేశ్, నాగేశ్, తదితరులు ఉన్నారు.

నేడు బూత్‌స్థాయి ఏజెంట్లకు శిక్షణ

తలకొండపల్లి: కల్వకుర్తి, అచ్చంపేట్ నియోజకవర్గాల బూత్‌స్థాయి (బీఎల్‌ఏ) బూత్ లెవెల్ ఏజెంట్‌ల శిక్షణను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. అచ్చంపేట్ పట్టణంలోని ఏసీఆర్ గార్డెన్స్‌లో శిక్షణ తరగతులను సోమవారం ఉ. 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఏఐసీసీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రివర్యు లు జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరవుతారని అన్నారు. నియోజకవర్గాల బూత్ లెవెల్ ఏజెంట్స్, కిసాన్‌సెల్ వర్కింగ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సేవాదళ్, మైనార్టీ, సోషల్ మీడియా, డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శులు, ఎస్సీసెల్, ఎన్ఎస్‌యూఐ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఇతర నాయకులందరూ తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరై విజయవంతం చేయగలరని ఆయన కోరారు.

వేద పాఠశాల అభివృద్ధికి సహకారం



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: వేద పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ఉన్న వేద పాఠశాలకు కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య స్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేదాలు మానవజాతి గొప్ప సంపద అన్నారు. ప్రాచీన సంస్కృతిని కాపాడుతూ విద్యార్థులను వేద విద్యపై ప్రోత్సహించడం హర్షనీయమన్నారు. చిన్ననాటి నుంచి విద్యార్థులకు వేదాలపై పట్టు సాధించే విధించే శిక్షణ ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. వేద పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. వేదాల ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన సురేష్‌కుమార్ సహకారంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, సజ్జల కాశీనాథ్, బసవేశ్వర్, భువనేశ్వర్, సంగయ్య, కొంకళ్ళ చెన్నయ్య, తిరుపతిరెడ్డి, నందు, జగదీశ్వర్, రవితేజ, మార్గం రాజేశ్, మాణిక్యం, రాఘవేందర్, రామ్మోహన్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మార్గాలు అన్వేషించాలి

యువత స్వయం ఉపాధి మార్గాలు అన్వేషించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని రామకృష్ణ థియేటర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాండ్ర విశాల, శ్రావణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.